క్లుప్తంగా

త్వరితగతిన పనులు

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్ అగ్రహారంలో ఉపాధి హామీ నిధులు నిర్మిస్తున్న చెత్త సంపద కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలో ఆదాయ వనరులు పెంపొందించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హైమావతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, లేనిపక్షంలో స్కావెంజర్స్ వేతనాలు నిలిపివేస్తామని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని పెరుమాళి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి స్కావెంజర్స్‌తో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులు సహకరించాలి

తెర్లాం: వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని నెమలాంలో భూముల రీసర్వేలో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల సరిహద్దులు గుర్తించే సమయంలో రైతులు దగ్గర ఉండాలన్నారు. రైతులంతా సహకరిస్తే సర్వే సకాలంలో పూర్తవుతుందని చెప్పారు. గ్రామసభలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

బాలరాజు నియామకంపై హర్షం

బాడంగి: మండలంలోని హాజరిజన పాల్తేరుకు చెందిన బిషప్ బ్రదర్ యజ్జల బాలరాజు ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఏపీ యువజన అధ్యక్షుడిగా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాలరాజు సోమవారం మాట్లాడుతూ, తనకు పదవి రావడంతో క్రిస్టియన్లకు మరింత సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

బొబ్బిలి రూరల్: పట్టణంలోని గ్రోత్‌సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోర్టు జంక్షన్‌లో ఉన్న పెట్రోల్ బంకులతో పాటు గొర్లెసీతారాంపురంలో ఉన్న పెట్రోల్ బంకులను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యత, ధరలపై ఆరా తీశారు. ఎటువంటి లోపాలున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో హెచ్‌పీసీఎల్ సేల్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.రాజారావు, సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు బూత్‌లు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంగా గుర్తించినట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సోమవారం సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొత్తం నాలుగు బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటివరకు రాజాం పట్టణం, మండలం నుంచి 3వేలకు పైగా పట్టభద్రులు ఓటర్లుగా పేరు నమోదు చేసుకున్నారన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

25న మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. అక్కారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పంచామృతాభిషేకాలు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి, నవనాగసహిత, బాలసుబ్రహ్మణ్య, కాలభైరవ, చండీశ్వర సహిత కాశీ విశ్వేశ్వర, విశాలక్ష్మి స్ఫటిక లింగాలకు భక్తులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు విశేషపూజలు నిర్వహించారు. మొగిలివలసతో పాటు పరిసర గ్రామాల భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

బొబ్బిలి రూరల్: మండలంలోని నిమ్మలపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడును సీహెచ్ బొడ్డవలస సర్పంచ్ పి.వేలంగణి, స్థానికులు ఘనంగా సత్కరించారు. గ్రామంలో నూతన చర్చి ప్రారంభించిన నేపథ్యంలో వేణుగోపాలనాయుడును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చొంగల రామకృష్ణ, న్యాయవాది రుంకాన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిటికెలో సందేహాలు నివృత్తి...

- పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్
- స్కాన్ చేస్తే సెకన్లలో పూర్తిస్థాయి సమాచారం
- ఒకటి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో ముద్రణ



రామభద్రపురం చింతలవీధి ఎంపీపీ పాఠశాలలో క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్

రామభద్రపురం: ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోంది. 'మనబడి నాడు–నేడు'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారు. అలాగే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. తాజాగా నూతన విద్యావిధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు సులభమైన రీతిలో పాఠాలు అర్థం చేసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పాఠ్యాంశాల సారాన్ని వీడియో రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. కొంతమంది విద్యార్థులు విని నేర్చుకుంటే... మరికొందరు చూసి నేర్చుకుంటారు. దృశ్యరూపం కచ్చితంగా విద్యార్థులకు జ్ఞాపకం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్త విధానానికి తెరతీసింది. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశం బోధించేటప్పుడు అటు ఉపాధ్యాయులకు ఇటు విద్యార్థులకు ఎన్నో సందేహాలు వస్తుంటాయి. అలాంటి సందేహాలను పూర్తిస్థాయిలో నివృత్తి చేసుకునేందుకు ప్రతి పాఠ్యాంశానికి టీచర్‌కు ఒకటి, విద్యార్థికి మరొకటి చొప్పున క్యూఆర్ కోడ్‌లు రూపొందించారు. ఒకటో



టీచర్ కార్నర్, స్టూడెంట్ కార్నర్‌తో రెండు క్యూఆర్ కోడ్‌లతో ముద్రించిన పాఠం

తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో కొత్తగా ప్రతి పాఠ్యాంశంపై క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వం ముద్రించింది. టీచర్ కార్నర్ పేరుతో ఉన్న క్యూఆర్ కోడ్ టీచర్, స్టూడెంట్ కార్నర్ పేరుతో ఉన్న క్యూఆర్ కోడ్‌ను విద్యార్థి తమ స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేసిన వెంటనే ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన పూర్తి సమాచారం వచ్చేస్తుంది. ఈ విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం...



విద్యార్థులు ఏ కారణంతోనైనా పాఠశాలకు రాకపోతే ఆ రోజు జరిగిన పాఠ్యాంశం అర్థం కాదు. ఇకపై క్యూర్ కోడ్ అందుబాటులోకి రావడం వల్ల ఎప్పుడు కావాలంటే అప్పుడు స్కాన్ చేసి వీడియో రూపంలో పాఠ్యాంశాన్ని అర్థం చేసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కానింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె. కామేశ్వరరావు, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల, రామభద్రపురం

వీడియో పాఠం ప్రత్యక్షం..



ఉపాధ్యాయులకు ఒకటి, విద్యార్థికి ఒకటి చొప్పున్న రెండు క్యూఆర్ కోడ్‌లు పొందుపరిచారు. పాఠ్యాంశాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన క్షణాల్లోనే వీడియో పాఠం ప్రత్యక్షమవుతుంది. పాఠ్యాంశాన్ని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు సైతం ఉంది. ఒక్కసారి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆ పాఠ్యాంశం వారి ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. దానిని విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంటుంది.

– లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి విజయనగరం

కోనేరు వివాదంపై విచారణ



కాంద్రంగి,సాలాది వారి వారసుల నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న తహసీల్దార్ సుబ్బారావు

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వద్ద గల సాలాది వారి కోనేరు పూడ్చివేత వివాదంపై రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కాంద్రంగి, సాలాది వారసులను రెవెన్యూ కార్యాలయానికి పిలిపించుకుని తహసీల్దార్ సుబ్బారావు వారితో మాట్లాడారు. ఎస్ఎఫ్ఏ ప్రకారం కోనేరున్న ప్రాంతం తమదేనని, తమ అవసరాల కోసం గతంలో తీసిన కోనేరును పూడుస్తున్నామని సాలాది అప్పలనాయుడు, సాలాది సత్యానారాయణ, సాలాది లక్ష్మునాయుడు తెలిపారు. కాంద్రంగి వారసుల నుంచి తమ పూర్వీకులు స్థలం కొనుగోలు చేసి అందులో కోనేరు తీశారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కోనేరును పూడ్చేస్తున్నారని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో నిజం లేదని సాలాది కుటుంబ సభ్యులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. నివేదికను ఆర్డీఓకు పంపిస్తానని తహసీల్దార్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం అవ్వాలి

రాజాం: వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు రాజాం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని సీసీలు, సీఎఫ్‌లు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలు ద్వారా వస్తున్న నగదుతో కుటీర పరిశ్రమల ఏర్పాటు, వ్యాపారాలు చేసేవిధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పాడి పరిశ్రమ, పెరటికోళ్ల పెంపకం బాగుందని, ఆదిశగా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

కార్యక్రమంలో ఏపీఎం టి.దధికుమార్, ఎస్వీఈపీ బీఆర్పీ శేషగిరి, ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీఓ తీరుపై సభ్యుల ధ్వజం



ఏపీఓను ప్రశ్నిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకు తగ్గట్టుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం పలుశాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులపై చర్చ సందర్భంగా గోళ్లవలస, కాకరాపల్లి, తమరాం పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను నాలుగేళ్లుగా భర్తీ చేయకుండా నెట్టుకొస్తున్నారని ఏపీఓ త్రినాథరావు పనితీరుపై మండిపడ్డారు. దీనిపై ఏపీఓ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డ్వామా పీడీకి ఫిర్యాదు చేసి ఏపీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖపై సమీక్షలో జావాం, తాలాడ, గోళ్లవలస, వాసుదేవపట్నం తదితర గ్రామాల్లో ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదులో తప్పులు చోటుచేసుకోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ధాన్యం కొనుగోలులో 80 కిలోల బస్తాకు అదనంగా నాలుగు కిలోలను మిల్లర్లు తీసుకుంటున్నారని, అందుకు వీఏఏలు సహకరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, సచివాలయాల మండల కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం...

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులంతా పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లుగా ఉన్న గ్రాడ్యుయేట్లను నేరుగా కలిసి సీతంరాజుకు ఓటువేసేలా చైతన్యపరచాలని సూచించారు. ఎన్నికకు కేవలం 20 రోజుల వ్యవధి మాత్రమే ఉందని, అభ్యర్థి మూడు జిల్లాలు తిరగాల్సి ఉన్న నేపథ్యంలో మనమే చిత్తశుద్ధితో ప్రచారం చేయాలన్నారు. పట్టభద్రులకు మన



పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధిని వివరించి ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఆర్థిక సంఘ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వంగర: మడ్డువలస కూడలి వద్ద సోమవారం వేకువజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై బుడుమూరు లోకేష్ తెలిపారు. ఓనె అగ్రహారం వద్ద నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

హుండీ వితరణ

రాజాం: పట్టణంలో నివాసముంటున్న గుంటూరుకు చెందిన భక్తులు పోలిపల్లి పైడితల్లి ఆలయానికి స్టీల్ హుండీని వితరణ చేశారు. చెల్లప్ప జయరాంరెడ్డి, చెల్లప్ప అయ్యప్పరెడ్డి కుటుంబీకులు హుండీని సోమవారం ఈఓ మాధవరావుకు అందించారు.

గంజాయి రవాణాపై తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ అధికారులు గంజాయి రవాణాపై సోమ వారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రయాణికులు, అనుమానితుల బ్యాగ్‌లు చెక్ చేశారు. ఇటీవల బొబ్బిలిలో గంజాయితో కొందరు వ్యక్తులు పట్టుబడడంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తనిఖీలు చేపట్టినట్లు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు ఈశ్వరరావు, శ్రీనివాసరావు తెలిపారు.

శ్మశానం కబ్జాపై ఆరా

మెంటాడ: మండల కేంద్రంలో కబ్జాకు గురైన శ్మశానాన్ని తహసీల్దార్ ఆదిబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 6 ఎకరాల విస్తీర్ణం ఉన్న శ్మశాన స్థలం 30 శాతానికి కుదించుకుపోవడంపై పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. కబ్జాకు గురైన స్థలాన్ని పూర్తి చదును చేసి వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. శ్మశానం చుట్టు రక్షణ గోడ నిర్మించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

బిల్లుల చెల్లింపు

బొబ్బిలి రూరల్: నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన భవన నిర్మాణాలకు 60 లక్షల రూపాయల బిల్లులు చెల్లించినట్లు పీఆర్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కూడా విడతల వారీగా చెల్లిస్తామని పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని డొంగురువలస, ఎరకందొరవలస గ్రామాల్లోని గిరిజనులకు గాంధీ స్మారకనిధి సభ్యులు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. తాము సేకరించిన దుస్తులతో పాటు గృహ సామగ్రిని అందజేసినట్లు గాంధీ స్మారకనిధి సభ్యులు విజయమోహన్, కృష్ణదాస్, మల్లేశ్వరరావు, మహేష్ తెలిపారు.

అపరాల కొనుగోలుకు అనుమతి

బొబ్బిలి రూరల్: నియోజకవర్గంలోని నాలుగు కొనుగోలు కేంద్రాల్లో అపరాల కొనుగోలుకు జేసీ అనుమతి ఇచ్చారని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం. శ్యామ్‌సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఆర్‌బీకేల ద్వారా అపరాలు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

యాదవ సంఘం హర్షం

రాజాం సిటీ: స్థానిక సంస్థల కోటాలో యాదవ కులానికి చెందిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించడం పట్ల యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, రాజాం నియోజకవర్గ అధ్యక్షుడు డొప్ప సింహాచలం యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమితమైన ప్రేమ ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. యాదవులకు సముచిత స్థానం కల్పించడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజాం సిటీ/సంతకవిటి: మున్సిపాలిటీ పరిధి పాలకొండ రోడ్డులోని ఓం విఘ్నేశ్వర పెట్రోల్ బంక్‌లో తహసీల్దార్ పి.విజయభాస్కర్, సీఎస్ డీటీ చిరంజీవరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. బంకులో వినియోగదారులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, పెట్రోల్ నాణ్యతను పరిశీలించారు. జాయింట్ కలెక్టర ఆదేశాలు మేరకు బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు పాటించని బంకులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వినియోగదారులను మోసగించకుండా పెట్రోల్ విక్రయాలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

నేడు గృహసారథులకు శిక్షణ

రేగిడి: మండలంలోని తాటిపాడు జంక్షన్ వద్ద ఉన్న రాయల్ ఆక్వా ఇండస్ట్రీస్ ప్రాంగణంలో మంగళవారం జరగనున్న 'మా నమ్మకం నువ్వే జగన న్న' శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. కార్యక్రమం ఏర్పాట్లను సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు ఈ శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. శిక్షణకు వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లును చేయాలని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగులు, నాయకులు

జగన్మోహనరావు, కన్వీనర్లు, గృహ సారథుల అబ్జర్వర్ పాలవలస రామచంద్రినాయుడుకు సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



ఎమ్మెల్యేను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు

బొబ్బిలి: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులుగా నియమితులైన వారందరూ సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంబంగిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అదేసమయంలో ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, పట్టణ జేఏసీ కన్వీనర్ రేజేటి విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాజాం: పట్టణంలోని కొత్తవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రాజు శ్రీనివాసరాజు, గజపతిరాజులును ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం పరామర్శించారు. ఇటీవల వారి తల్లి మాత్రాజు బంగారమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కొయ్యాన ఆదినారాయణ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా, అతని తల్లిదండ్రులు కొయ్యాన తవిటినాయుడు, రమణమ్మలను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ రాజాం, వంగర మండలాల కన్వీనర్లు లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

సమస్యలు పరిష్కరించాలి



సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గిరిజనులు

బొబ్బిలి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ మాట్లాడుతూ, గిరిజనులు కొండలపై స్థిరపడి, నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. అటువంటి వారికి వసతులు కల్పించకపోగా, హక్కులు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాగే గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, నివాసం ఉంటున్న గ్రామాలను దగ్గరలో ఉన్న పంచాయతీలలో చేర్పించాలని, ఫారెస్ట్ అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ పి.శేషశైలజకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మునకాల శ్రీనివాస్, కోట అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు

రాజాం సిటీ: ఈ నెల 22 నుంచి 24 వరకు పంజాబ్ గురుకేష్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వ విద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ బీహెచ్ అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో జీఎంఆర్ ఐటీ విద్యార్థులు జి.గౌతమ్, సీహెచ్ గణేశ్వరరావు ఉత్తమ ప్రదర్శన కనబరిచి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. కాకినాడ జేఎన్‌టీయూ జట్టు తరఫున వీరు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఎంపికపట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ ఆఫీసర్ డాక్టర్ శశికుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



జి.గౌతమ్



సీహెచ్ గణేశ్వరరావు

కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎఫ్‌పీఓ అధ్యక్షుడు వెంకటరావు

తెర్లాం: మండలంలోని గోపాలవలస పంచాయతీ జగన్నాథవలసలో రూ.12.50 లక్షలతో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంఘ మండల అధ్యక్షుడు గొంందాల వెంకటరావు మాట్లాడుతూ, గ్రామంలో ఇప్పటికే రూ.15 లక్షలతో మామిడికాయల కలెక్షన్ సెంటర్ నిర్మించామని, మరో రూ. 12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజ్ నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ బోర్డు డైరెక్టర్లు ఎస్.బుచ్చివెంకటరావు, రాంబాబు, వెలుగు ఏపీఎం టి.రాము, తదితరులు పాల్గొన్నారు.

మెంటిపేటలో కొనసాగుతున్న పోలీసు పికెట్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీ, మెంటిపేట గ్రామాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. సోమవారం ఎస్సై వై.రవికిరణ్, మరో పది మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ సీహెచ్ ఉపేంద్ర తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎస్సీకాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని దళిత సంఘాల జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మెంటిపేట కాలనీలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేష్ మృతి హత్యేనని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు వేణు ఆరోపించారు. దీనిపై అనుమానాలు నివృత్తి చేసేవిధంగా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మెంటిపేట తెలగ కులానికి చెందిన పలువురు మహిళలు మీడియా ముందుకువచ్చి తమకు రక్షణ కల్పించాలని విన్నవించారు.



మెంటిపేటలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

26 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర



మాట్లాడుతున్న ఈఓ మాధవరావు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఉన్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని ఈఓ బీవీ మాధవరావు కోరారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు, మున్సిపల్, ఫైర్ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26 నుంచి 28 వరకు 97వ వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 26న ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయం పోటీలు ఉంటాయని కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ తెలిపారు. అనంతరం అమ్మవారి కథా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, హెచ్‌సీ కృష్ణంనాయుడు, ఆలయ ధర్మకర్తలు వాకచర్ల దుర్గాప్రసాద్, వాకచర్ల రాజా, పైడిరాజు, ఆలయ పురోహితులు వేమకోటి సూర్యనారాయణశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.